ఉచితం.. నెరవేరేనా..!

- ఉచిత బస్సు ప్రయాణానికి ఎదురు చూస్తున్న మహిళలు
- అధిక లోడ్‌తో ఆటోలను ఆశ్రయిస్తున్న మహిళా కూలీలు


ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు


ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతలు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చని, కూలి పనులకు కూడా బస్సులలో వెళ్లవచ్చని ఆశించిన మహిళల ఆశలు అడియాసలయ్యాయి. దీంతో భారీ లోడ్‌తో, గుంతల రోడ్డుపై ఆటోలను మహిళా కూలీలు ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా ఉచిత బస్సు పథకం అమలులోకి వస్తే ఎక్కువగా ఉపయోగపడేది మహిళా కూలీలు, నిత్యం వివిధ పనులు, వృత్తి ఉద్యోగాలకు బస్సులపై ఆధారపడి ప్రయాణించే వారికే. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తకపోవడం, కనీసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై మహిళలు నిరాశకు గురవుతున్నారు. మహిళలు ఉచిత బస్సు హామీ నెరవేరేనా ఆశగా ఎదురు చూస్తున్నారు.

- బ్యాంకులలో కుదవపెట్టిన బంగారు వస్తువులు విడిపించవద్దని, వాటి రుణాన్ని రద్దు చేస్తానని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు ఆ హామీలను అమలు చేయకపోవడంతో మహిళలు తీవ్రంగా మోసపోయారు. మళ్లీ 2024లో జనసేన, బీజేపీలతో జతకట్టి కూటమిగా ఏర్పడ్డ టీడీపీ హామీలవైపు మొగ్గు చూపారు. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణం, 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 వస్తాయన్న నమ్మకంతో ఓటు వేసి మోసపోయామని మహిళలు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు.

ఆటోలను ఆశ్రయిస్తున్న మహిళా కూలీలు

అచ్చంపేట మండలంలో మహిళా కూలీలు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు అధికంగా ఉంటారు. గ్రామాల నుంచి ప్రతి నిత్యం వైద్యం, వ్యవసాయం, నిత్యావసర వస్తువులు, వివిధ కార్యాలయాలకు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే వారు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కనీసం ఇచ్చిన హామీ అమలుపై పెదవి విప్పకపోవడంపై విస్మయానికి లోనవుతున్నారు.

- ఇక కూలీ పనులకు, పొలాలకు వెళ్లే వారు పరిమితికి మించి ఒక ఆటోలో 30 నుంచి 40 మంది వరకు ఎక్కుతున్నారు. అసలే గతుకుల రోడ్లపై ప్రయాణం కావడంతో ఎక్కడ.. ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో గత్యంతరం లేని పరిస్థితులలో ప్రయాణం చేస్తున్నారు.

మండలంలో ఇలా...

అచ్చంపేట మండలంలో 80 వేల మంది జనాభా, 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సగానికి పైగా మహిళలు ఉండటం గమనార్హం. వీరంతా ఎప్పుడెప్పుడు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. అచ్చంపేట నుంచి మాదిపాడు వరకు ఆరు గ్రామాలున్నాయి. ఈ రూటుకు లిమిటెడ్ బస్సులు తిరుగుతుంటాయి. హామీ అమలులోకి వస్తే ఎక్కువ బస్సులు వేస్తారని, ఉచితంగా ప్రయాణించవచ్చని వారంతా ఆశిస్తున్నారు.

అన్నదాత సుఖీభవకు 20తో గడువు ముగింపు

నకరికల్లు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం తెలిపారు. మండలంలోని 16,170 మంది రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత కలిగి ఉన్నట్లు తెలియజేశారు. అటవీ శాఖ భూములకు పట్టాలు పొంది ఉన్న రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్‌లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు.

క్లుప్తంగా

క్రోసూరు ఎంపీడీవోగా రవికుమార్ బాధ్యతలు



క్రోసూరు: క్రోసూరు ఎంపీడీవోగా జి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై క్రోసూరు ఎంపీడీవోగా వచ్చారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉన్న జి.శ్రీనివాస్ క్రోసూరు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తారు. ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న జి.రవికుమార్‌కు క్రోసూరు మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రచయిత్రి రమాదేవికి దాసరి ఇంటర్నేషనల్ అవార్డు



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన రచయిత్రి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సరికొండ రమాదేవికి డాక్టర్ దాసరి నారాయణరావు ఇంటర్నేషనల్ అవార్డ్–2025ను ప్రదానం చేశారు. డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఈ నెల 15న హైదరాబాద్ చిక్కడిపల్లిలోని త్యాగరాజ గాన సభలో ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ అభినందన సంస్థ చైర్మన్ నాదమునుల రామారావు సతీమణి అధ్యక్షతన వివిధ రంగాలలో ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేశారు. దీనిలో భాగంగా సాహిత్య, సేవా రంగాలలో చేస్తున్న సేవలను గుర్తించి సత్తెనపల్లికి చెందిన రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి డాక్టర్ దాసరి నారాయణరావు ఇంటర్నేషనల్ అవార్డ్, మెమెంటో, సర్టిఫికెట్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవిని పట్టణంలోని వివిధ కళా సంస్థల అధినేతలు, కార్యదర్శులు, కళాకారులు, సాహిత్య ప్రియులు ప్రత్యేకంగా అభినందించారు.

వాటర్‌ప్లాంట్ తగులబెట్టిన గుర్తుతెలియని దుండగులు



అమరావతి: మండల కేంద్రమైన అమరావతి పాండురంగస్వామి గుడి వీధిలోని జి.కె.వాటర్ ప్లాంట్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తగులబెట్టిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులందించిన వివరాల ప్రకారం గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వాటర్ ప్లాంట్‌ను తగులబెట్టారని, ప్లాంట్ యజమాని జి.శశిరేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని సీఐ అచ్చియ్య తెలిపారు. సమీపంలోని దుకాణాలలో ఉన్న సీసీ పుటేజిని పరిశీలిస్తున్నామన్నారు.

ఇండియా బీచ్‌గేమ్స్–2025 పోటీలకు ఎంపికైన హర్షవర్ధన్



సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బేతాళం హర్షవర్ధన్ ఖేలో ఇండియా బీచ్ గేమ్స్–2025 సముద్రం స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21, 22 తేదీల్లో డయ్యూ డామన్ (యూటీ)లో జరగనున్న 5 కిలోమీటర్ల ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. గతంలో 2023–24 సంవత్సరంలో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఓపెన్ వాటర్ 5 కిలోమీటర్లు స్విమ్మింగ్ పోటీల్లో ఉడిపి, బెంగళూరులో జరిగిన ఈవెంట్స్‌లో పాల్గొని రాణించాడు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన హర్షవర్ధన్‌ను ప్రగతి కళాశాల డైరెక్టర్లు దగ్గుపాటి శివబ్రహ్మారెడ్డి, ఎం.సుబ్బరాజు, షేక్ జానీబాషా, డి.శ్రీనివాసరావు, యు.సోమేశ్వరరావు, ఒ.శ్రీనివాసచారి తదితరులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

బస్టాండ్‌లో స్లాబ్‌కు మరమ్మతులు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్లాబ్ పెచ్చులూడి పడటాన్ని సివిల్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లగా బస్టాండ్ తనిఖీ చేసి లూజుగా ఉన్న స్లాబ్ అంతా వర్క్ చేసే నిమిత్తం టెండర్లు పిలిచి లూజుగా ఉన్నదాన్ని పగలగొట్టి స్లాబ్ మరమ్మతులు పూర్తి చేసినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం తెలిపారు. అలాగే కంట్రోల్ పాయింట్ వద్ద కూడా మైక్ పెట్టి ప్రయాణికులకు సమాచారం సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


ముప్పాళ్ళ పీహెచ్‌సీ వద్ద డెంగీ అవగాహనా ర్యాలీలో వైద్యాధికారి జయకృష్ణప్రవీణ్, వైద్య సిబ్బంది


బెల్లంకొండ డెంగీ దినోత్సవ ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది


ర్యాలీలో రాజుపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

ముప్పాళ్ళ: దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.జయకృష్ణప్రవీణ్ చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవంలో భాగంగా ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి వి.జయకృష్ణప్రవీణ్ మాట్లాడుతూ జూన్ నుంచి వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ దోమలను నియంత్రించాలన్నారు. ముఖ్యంగా మంచినీటి తొట్టెలు, ఫ్రిజ్‌లు, వాటర్ ట్యాంక్లు, ఇంటి లోపల బిందెలు వంటి వాటిల్లో డెంగీ వ్యాధికి కారణమైన ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ జీవిస్తుందన్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే ఈ దోమ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఈ దోమలు సాధారణంగా పగటిపూట కుట్టే అవకాశం ఉందని, దోమలు గుడ్లు పెట్టకుండా బిందెలు, తొట్టెలకు మూతలు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు ఎ.పీటర్‌డేమియన్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, స్టాఫ్ నర్స్ కామాక్షి, ఏఎన్ఎంలు సుశీల, జ్యోతి, అన్నామణి, గ్రామస్తులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంకొండలో డెంగీ దినోత్సవ ర్యాలీ

బెల్లంకొండ: మండలంలోని చండ్రాజుపాలెం పీహెచ్‌సీ, అన్ని గ్రామాల హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ నజీర్ మాట్లాడుతూ ఈ ఏడాది డెంగీని పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండన్న మూడు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పక నిర్వహించాలని కోరారు. తద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో మణికుమారి, ఏఎన్ఎంలు, ఆశాలు, స్టాఫ్‌నర్సులు, ఓపీకి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ముందస్తు చర్యలే కీలకం

రాజుపాలెం: డెంగీ వ్యాధిని అరికట్టేందుకు ముందస్తు చర్యలే కీలకమని డాక్టర్ పాల్ రవి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీను అరికట్టేందుకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కీలకమన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి తొట్టెలు, డబ్బాలు, కొబ్బరి బొండాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల పార్లమెంట్‌పై అవగాహన


మాట్లాడుతున్న గుడ్ షెపర్డ్స్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామ సచివాలయంలో గుడ్ షెపర్డ్స్ కాన్వెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యకర్తలకు, బాలల సంరక్షణ కమిటీ సభ్యులకు బాలల పార్లమెంటుపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాశమ్మ అధ్యక్షత వహించారు. గుడ్ షెపర్డ్స్ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై వలంటీర్స్‌కి వివరించారు. అదేవిధంగా బాలల పార్లమెంటు ఆవశ్యకత గురించి వివరించారు. సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత చెడు మార్గంలో నడుస్తున్నారని వారిని మంచి మార్గంలో నడిపించి వారికి బంగారు భవిష్యత్తు అందించవలసిన అవసరం అందరిపై ఉందన్నారు. సంస్థ ప్రతినిధి బత్తుల బాబు మాట్లాడుతూ బాలల పార్లమెంటు గ్రామాల్లో ఏ విధంగా ఏర్పాటు చేస్తారు, ఎంత మంది మంత్రులు, ప్రధానమంత్రి, మంత్రుల బాధ్యతలు వంటి వాటిపై వివరించారు. బాలల పార్లమెంటు ముందుకు సాగాలంటే వలంటీర్లు ముఖ్యపాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల బాబు, సచివాలయం మహిళా పోలీస్ నాగశౌర్య, పవన్ కుమార్, గ్రామ పెద్దలు నారాయణ, ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి విద్యాసంస్థల అధినేత అచ్చయ్యకు బెయిల్ మంజూరు

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్యపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొంత కాలంగా ప్రగతి విద్యాసంస్థల పరిధిలోని అమరావతి పాఠశాలకు సంబంధించిన విషయంలో అచ్చయ్య, మరో వర్గానికి మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రత్యర్థి వర్గం అచ్చయ్య నుంచి బలవంతంగా పాఠశాలను స్వాధీన పరుచుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య సమావేశాలు, సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ అవి ఫలించకపోవడంతో ప్రత్యర్థి వర్గం ఒత్తిళ్ల మేరకు డాక్టర్ మక్కెన అచ్చయ్యపై సెక్షన్ 307 కింద గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కూడా బయటకు వెల్లడించలేదు. శుక్రవారం అచ్చయ్యను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో ఏరియా వైద్యశాలలో అచ్చయ్యకు వైద్య పరీక్షలు నిర్వహించి సబ్ జైలుకు తరలించే క్రమంలో బెయిల్ మంజూరయింది.

పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చు

సీడీపీవో శ్రీలత


కిశోరి వికాసం కార్యక్రమంలో సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో సంతోషికుమారి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి


మాట్లాడుతున్న సీడీపీవో సరళ


సత్తెనపల్లిలో కిశోరి వికాసంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): కౌమార దశలో రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీవో శ్రీలత చెప్పారు. మండలంలోని ఐసీడీఎస్ ముప్పాళ్ళ సెక్టార్ పరిధిలోని లంకెలకూరపాడు గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రక్తహీనత ఉన్నప్పుడు అలసట, బలహీనత, తల తిరగడం, శ్వాస ఆడకపోవడం, చర్మం రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, బాలల రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో టి.సంతోషికుమారి, సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి, మహిళా పోలీస్ ఎ.ఝాన్సీరాణి, అంగన్‌వాడీ కార్యకర్త శోభాలత, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు, క్రోసూరులలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఊటుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి మాట్లాడుతూ కిశోర బాలికలు సరైన పోషకాహారం తప్పకుండా తీసుకోవాలని, అలా తీసుకోకపోతే రక్తహీనతకు గురవుతారని అన్నారు. ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని చెప్పారు. అదే విధంగా వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలి: సీడీపీవో సరళ

కందిపాడు(బెల్లంకొండ): మండలంలోని కందిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సరళ పాల్గొని మాట్లాడుతూ కౌమర దశలో రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఐరన్ పుష్టిగా లభించే ఆహారం తీసుకోవాలన్నారు. వేరుశనగ చిక్కీలు, బెల్లం, ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, గుడ్లు, సమతులంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో సూపర్‌వైజర్ వనజ, మహిళా పోలీసు నందిని, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, నాగమల్లేశ్వరి, ఆశాలు హనుమాయమ్మ, నీలిమ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కౌమార బాలికలు అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి: కౌమార బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వేసవి కాలంలో కౌమార బాలికలను అన్ని విధాల అప్రమత్తం చేసి అవగాహన కల్పించేలా కిశోరి వికాసం పేరుతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏఎన్ఎం సౌజన్య, ఎంఎస్‌కే మస్తాన్‌బీలు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, తిరుపతమ్మ, ఝాన్సీ, కౌమార బాలికలు తదితరులు ఉన్నారు.

దుకాణాలపై దూసుకుపోయిన లారీ

- పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం


దుకాణాలపై దూసుకుపోయిన లారీ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో లారీ అదుపు తప్పి దుకాణాలపై దూసుకుపోయిన ఘటనలో ఆస్తినష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల మేరకు రాజమండ్రి నుంచి బెంగళూరుకు ఎరువుల లోడుతో బయలు దేరిన లారీ మార్గమధ్యంలో శావల్యాపురం ప్రధాన కూడలి మార్గానికి రాగానే వినుకొండ నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న లారీను ఢీకొట్టింది. దీంతో ఎరువుల లోడు లారీ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు వెంబడి ఉన్నటువంటి దుకాణాలపైకి దూసుకెళ్లింది. డ్రైవరు సయ్యద్ జాకీర్ హుస్సేన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, పిన్నెల్లి కోటేశ్వరరావు, హరిబాబు, సముద్రపు శ్రీనివాసరావు, భవరిశెట్టి కోటేశ్వరరావు, జవ్వాజీ అంజయ్య, జక్కా శ్రీనివాసరావు దుకాణాలన్నీ ముందు భాగం పూర్తిస్థాయిలో ధ్వంసం అయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఏరియా కావటం మరో వైపు ఆటో స్టాండ్ కావటం చేత ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈప్రమాదంలో హోటల్ భవరిశెట్టి కోటేశ్వరరావు దుకాణంలో సలసల కాగుతున్న వంట నూనె గ్యాస్ సిలిండరు కొంతమేర నగదు, సెల్‌ఫోను తదితర సామగ్రి అంతా చెల్లాచెదురు అయ్యాయి. గ్యాస్ సిలిండరు లారీ కిందకు వెళ్లటంతో పోలీసులు అప్రమత్తం అయి ఏరియాలో ప్రజలను గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టారు. వినుకొండ అగ్నిమాపక అధికారి బీర్నేడి నాగేశ్వరరావు తన సిబ్బంది ఫైరు ఇంజినుతో ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బుస్సా ఆదినారాయణకు చెందిన ఆటో ముందు భాగం కొంతమేర దెబ్బతింది. జక్కా సాంబశివరావుకు గాయాలయ్యాయి. వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు, రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, ఎంవీ కృష్ణారావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరు జాకీర్ హుస్సేన్‌ను స్థానికుల సహాయంతో బయటకు తీసి 108 అత్యవసర వాహనంలో స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ఏరియా కావటంతో పెను ప్రమాదం తప్పిందని అందరు ఊపిరి పీల్చుకున్నారు. క్రేన్ సహాయంతో దుకాణాల మధ్యలో ఇరుక్కోపోయిన లారీని పోలీసులు బయటకు తీసే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు.

మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



బొల్లాపల్లి : ప్రొహిబిషన్ /ఎక్సైజ్ ఈపూరు స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని, అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి పనితీరుపై పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని తెలిపారు.

ఫణిదంలో ఇంటిపై పడిన పిడుగు

సత్తెనపల్లి: ఇంటిపై పిడుగు పడి తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం గురువారం రాత్రి గంటకు పైగా కురిసింది. ఈ క్రమంలో ఫణిదం గ్రామానికి చెందిన యర్రగుంట్ల వెంకటేశ్వర్లు ఇంటిపై పిడుగు పడటంతో వాటర్ ట్యాంక్, విద్యుత్ పైపులు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

సత్తెనపల్లి: బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు చెందిన పెద్ద పిచ్చయ్య (80)ను సత్తెనపల్లి నుంచి గుంటూరు వెళ్లే హయర్ బస్సు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చే సమయంలో ఢీ కొట్టింది. వృద్ధుడి రెండు కాళ్లకు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

రెండు నివాసాల్లో చోరీ

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఎవరూ లేని రెండు ఇండ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్రైవర్ నరవారి హనుమాసింగ్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. సింగ్ డ్రైవర్‌గా తన విధులు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి రాగా, ప్రధాన తలుపుకు వేసి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా గదుల్లో వస్తువులన్నీ అస్తవ్యస్తంగా ఉండటంతో చోరీ జరిగినట్టు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బీరువాలోని రూ.20 వేల నగదు, 50 తులాల వెండి, 9 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు.

మరో ఇంట్లో చోరీ యత్నం

సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలోనూ చోరీయత్నం జరిగింది. సదరు కుటుంబం కూడా స్థానికంగా లేకపోవడంతో తలుపు తాళాలు పగులగొట్టి అంతటా వెతికి విలువైన వస్తువులేమీ కనిపించక పోవడంతో వెళ్లారు. ఇదే విషయాన్ని ప్రమీలకు స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం పిలిపించి ఆధారాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు. అయితే దుండగులు ప్రొఫెషనల్ దొంగలు అయి ఉంటారని ఘటనా స్థలాల్ని పరిశీలించిన పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడిస్తున్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో పిడుగురాళ్ల విద్యార్థినికి ర్యాంక్

పిడుగురాళ్ల: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బి. మేఘన స్టేట్ 4వ ర్యాంక్‌ను సాధించింది. ఈ సందర్భంగా శారదా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోనే తమ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం అభినందనీయమని తెలిపారు. కోచింగ్ సెంటర్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఏపీఆర్‌జేసీలో ఫ్రీ సీట్లు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. స్కాలర్ స్కూల్‌లో పదో తరగతి చదివిన మేఘన పరీక్ష ఫలితాల్లో కూడా 656 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కాలర్ డైరెక్టర్స్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

సరస్వతి నది పుష్కరాలలో భక్తులకు అన్నదానం



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన జూలకంటి శ్రీనివాసరావు ప్రయాగ్ రాజ్‌లోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్య వైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సరస్వతి నది పుష్కరాలలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రయాగరాజ్, వారణాసీలలో 12 రోజులు అన్నదానం చేస్తామని జూలకంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు యాద అశోక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పసుమర్తి మల్లికార్జున, కోశాధికారి జూలకంటి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు లగిశెట్టి వినోద్, ప్రయాగరాజ్ పురోహితులు పవన్ శాస్త్రి పాల్గొన్నారు.